

డ్రాగా ముగిసిన జోనల్ మ్యాచ్

కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జోనల్ అండర్-23 క్రికెట్ టోర్నమెంట్‌లో నిర్వహించిన రెండోదశ మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. -8లో



వర్షం..అప్రమత్తత అవసరం

తుపాను వల్ల జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందని. రైతులు అప్రమత్తంగా ఉంటూ పంటలను కాపాడుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావు తెలిపారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.240
రెండోరకం	రూ.100	రూ.178



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 291 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	415	415
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 54.600 కిలోలు

న్యూస్‌రీల్

గ్రూప్-2కు ఉచిత శిక్షణ

రాయచోటి టౌన్: గిరిజన యువతకు తిరుపతిలోని ప్రముఖ విద్యాసంస్థల ద్వారా ఉచితంగా గ్రూప్ -2 కోచింగ్ ఇప్పించనున్నట్లు జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి అబ్బలోము శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన సంక్షేమశాఖ(విజయవాడ) ఆదేశాల మేరకు ఐటీడీఏ (యానాదులు) నెల్లూరు కార్యాలయ ప్రాజెక్టు పరిధిలో నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్సార్ కడప జిల్లాల్లో నిరుద్యోగ యువతీ యువకులకు తిరుపతి పట్టణంలో ప్రముఖ గ్రూప్-2 కోచింగ్ సెంటర్‌లో ఉచితంగా భోజనం, వసతి కల్పించి శిక్షణ ఇప్పిస్తామన్నారు. ఆసక్తి గలవారు 5వ తేదీ లోపు ఆయా జిల్లాల్లోని డీఎస్‌టీడబ్ల్యూ, ఈవో, డీటీడబ్ల్యూ వారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు విద్యార్హత, కుల ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డు నకళ్లు దరఖాస్తులు దరఖాస్తుతో పాటు జతపరచాలన్నారు. మరిన్ని వివరాల కోసం సెంటర్ మేనేజర్ ఎం.బాలాజీని 8187899877 నంబరులో సంప్రదించాలన్నారు.

డీపీఎంఓగా డాక్టర్ రియాజ్ బేగ్



రాయచోటి అర్బన్: అన్నమయ్య జిల్లాలో జాతీయ ఆరోగ్యమిషన్ పర్యవేక్షణకు డీపీఎంఓ (డిస్ట్రిక్ట్ పోగ్రామ్ మానిటరింగ్ ఆఫీసర్) గా డాక్టర్ రియాజ్ బేగ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు పనిచేసిన లోకవర్ధన్ కొద్దిరోజుల క్రితం ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. డాక్టర్ రియాజ్‌బేగ్ రాయచోటి పీపీ యూనిట్ వైద్యాధికారిగా విధులు నిర్వర్తించేవారు. రియాజ్‌బేగ్ నియామకం పట్ల డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ కొండయ్య, డిస్ట్రిక్ట్ ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ లోకవర్ధన్, అదనపు డీఎం అండ్ హెచ్‌ఓ శైలజ, డీఎస్ఎంఓ విష్ణువర్ధన్ రెడ్డి, ఏఓ మధుసూదన్ రెడ్డి, డీఐఓ ఉషశ్రీ, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్‌రఫీలు అభినందనలు తెలిపారు.

'జేఎన్టీయూ'కు అకడమిక్ అటానమీ



జేఎన్టీయూ కళాశాల

కలికిరి: కలికిరి జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలకు అకడమిక్ అటానమీ మంజూరు చేస్తూ అనంతపురం జేఎన్టీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొ।।సి.శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. కళాశాల ఏర్పాటై పదేళ్లు పూర్తి కావడంతో అకడమిక్ అటానమీ అవకాశం కల్పించాలని అక్టోబరులో కళాశాల ప్రిన్సిపాల్ యూనివర్సిటీకి ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు యూనివర్సిటీ అకడమిక్ సెనేట్ కౌన్సిల్, యూనివర్సిటీ ఎక్జిక్యూటివ్ కౌన్సిల్ పరిశీలించి ఆమోదం తెలిపాయి. దీంతో ఈ ఏడాది నుంచి బోధనాపరమైన స్వయం ప్రతిపత్తి(అకడమిక్ అటానమీ) విధానం అమలుకు వీసీ ఆదేశాలు జారీ చేశారు. వచ్చే మూడేళ్లపాటు ఇది అమలులో ఉంటుందని ఉత్తర్వులలో పేర్కొన్నారు. సిలబస్ తయారీ, ప్రశ్నపత్రాల రూపకల్పన, పరీక్షలు నిర్వహించుకోవడం వంటి సదుపాయాలుంటాయని ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.

నూతన నియామకం



ఎస్ఎస్ కుమార్ స్వామి గుప్తా

వేంపల్లె: ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ నూతన డైరెక్టర్‌గా ఎస్ ఎస్ కుమార్ స్వామి గుప్తా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మెకానికల్ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహించేవారు. డైరెక్టర్ అయిన సందర్భంగా ఆయనను కళాశాల అధ్యాపకులు అభినందించారు.

ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీలో అప్రెంటీస్ చేసేందుకు 1.11.2023 నుంచి 15.11.2023 తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వైఎస్సార్ జిల్లాకు చెందిన ఐటీఐ అభ్యర్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం కర్నూలులో హాజరు కావాలని ఏపీఎస్ ఆర్టీసీ కర్నూలు జోనల్ సిబ్బంది శిక్షణా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నజీర్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ ఎస్టీ బీసీ అభ్యర్థులు కుల ధృవీకరణ పత్రాలు, దివ్యాంగులైతే ఆయా ధృవీకరణపత్రం, మాజీ సైనికులైతే ధృవీకరణపత్రం, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంకు అకౌంట్ పాసుపుస్తకం, పాస్‌పోర్టు సైజ్ ఫోటో, ఆధార్‌కార్డు అన్నీ సెట్ల జిరాక్స్ కాపీలతో సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం ఫీజు రూ. 118తో హాజరు కావాలన్నారు. ఏదైనా సందేహాలు ఉంటే 08518-257025 నంబర్‌లో ఆఫీసు పనివేళల్లో సంప్రదించాలన్నారు.

వినూత్న బోధన..గణిత సాధన

ప్రతి విద్యార్థి ప్రతి అంశాన్ని సులభంగా నేర్చుకోవాలి. ఏ అంశమైనా సరే బోధన సరళంగా ఉంటేనే మక్కువ చూపుతారు. ఈవిషయాన్ని గమనించారు హెచ్ఎం నాగలక్ష్మిదేవి. వినూత్న బోధన చేపడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. తాను పనిచేస్తున్న పాఠశాలనే గణితాలయంగా మార్చారు. పిల్లలకు మ్యాథ్స్ సులభంగా అర్థమయ్యేలా చర్యలు చేపట్టి వారి జీవితాల్లో వెలుగులు నింపారు. త్వరలో జాతీయ స్థాయి పురస్కారం అందుకోనున్నారు.

- విద్యార్థులకు సులభంగా మ్యాథ్స్ అర్థమయ్యేలా చర్యలు
- జాతీయ పురస్కారానికి ఎంపికైన మెరాయిపల్లె స్కూల్ హెచ్ఎం నాగలక్ష్మిదేవి



పాఠశాలలో ఏర్పాటు చేసిన అబాకస్ ద్వారా పిల్లలకు బోధిస్తున్న నాగలక్ష్మిదేవి (ఫైల్)



మొర్రాయిపల్లె ప్రాథమిక పాఠశాల

కడప ఎడ్యుకేషన్: వైఎస్సార్ జిల్లా చాపాడు మండలం మొర్రాయపల్లె ప్రాథమిక పాఠశాలలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్న మైనపురెడ్డి నాగలక్ష్మిదేవి నూతన బోధన పద్ధతులపై జాతీయస్థాయిలో నిర్వహించిన ఇన్నోవేటివ్ పెడాగోజి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి అత్యుత్తమ స్థానాన్ని దక్కించుకుంది. విద్యా అమృత్ మహోత్సవ్ 2022-23లో భాగంగా విద్యా మంత్రిత్వశాఖ, కేంద్ర సీఐఈటీ, ఎన్‌సీఈఆర్‌టీ సంయుక్తంగా ఇన్నోవేటివ్ పెడాగోజి అంశంపై పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు దేశవ్యాప్తంగా 5.99 లక్షల ప్రాజెక్టులు వచ్చాయి. ఇందులో 63 ప్రాజెక్టులను జాతీయ స్థాయికి ఎంపిక చేశారు. వీటి నుంచి జాతీయ స్థాయి జ్యూరీ టాప్-10 విద్యా అమృత్ మహోత్సవ్ ప్రాజెక్టులను ప్రకటించింది. వీటిలో ఆంధ్రప్రదేశ్ తరపున వైఎస్సార్ జిల్లా మొర్రాయిపల్లె ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు మైనపురెడ్డి నాగలక్ష్మిదేవి రూపొందించిన ''పర్మినెంట్ మ్యాథ్స్ టీఎల్ఎం''ప్రాజెక్టు జాతీయస్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది.

నాడు-నేడు పనులను...



ప్రభుత్వం చేపట్టిన నాడు- నేడు పనుల్లో భాగంగా తమ పాఠశాలలో చేపట్టిన మొదటి విడత పనులను తమ పిల్లల విద్యాభివృద్ధికి అనుగుణంగా చేయించా రు. ఇందులో భాగంగా పాఠశాల ఇనుప కటాంజనాలలో అబాకస్, భిన్నాలు, ఆరోహణ, అవరోహణ క్రమాలను అమర్చించుకుంది. ఫ్లోరింగ్, చెట్ల పాదులకు గణిత అకారాలను అమర్చారు. వీటిని పిల్లలు రోజు చూడటం, తాకడం ద్వారా గణతం అంటే భయం పోయి ఆసక్తి పెంచుకున్నారు. వీటిని నిత్యం చూస్తుండం ద్వారా పిల్లలకు గణితం అంటే భయం పోయి సులభంగా మ్యాథ్ సబ్జెక్టు పట్ల ఆసక్తిని చూపుతున్నారని హెచ్ఎం నాగలక్ష్మిదేవి తెలిపారు.

త్వరలో ఢిల్లీలో అవార్డు ప్రదానం

విద్య అమృత్ ఫలితాల్లో ఆంధ్రప్రదేశ్ తరపున ప్రతిభచాటిన ప్రధానోపాధ్యాయురాలు మైనపురెడ్డి నాలక్ష్మిదేవికి త్వరలో ఢిల్లీఓ పురస్కారాన్ని అందించనున్నారు. విద్యా మంత్రిత్వశాఖ, సీఐఈటీ, ఎన్‌సీఈఆర్‌టీలు సంయుక్తంగా అమెను సత్కరించి అవార్డును ప్రదనం చేయనున్నారు.

చాలా సంతోషంగా ఉంది



జాతీయస్థాయిలో పురస్కారం రావడం చాలా సంతోషంగా ఉంది. చాపాడు మండలం మొర్రాయిపల్లె ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసేటప్పుడు ఇక్కడ జరిగిన నాడు- నేడు పనులను తమ పిల్లల బోధనకు అనుకూలంగా మ్యాథ్స్‌కు సంబంధించిన నమూనాలను రూపొందించాను. దీంతో పిల్లలకు మ్యాథ్స్ సబ్జెక్టు అంటే భయం పోయింది. నేను ఇటీవల జరిగిన బదిలీల్లో మైదుకూరు మండలం సుంకులుగారిపల్లె యూపీ స్కూల్‌కు బదిలీపై వెళ్లాను. – మైనపురెడ్డి నాగలక్ష్మిదేవి, ఉపాధ్యాయురాలు, యూపీ స్కూల్, సుంకులుగారిపల్లె

పాఠశాలను గణితాలయంగా మార్చి..



పాఠశాలలో ఏర్పాటు చేసిన మ్యాథ్స్ నమూనాలు

చాలా మంది చిన్నారులకు మ్యాథ్స్ సబ్జెక్టు అంటే భయం. ఆ భయాన్ని పారదోలి విద్యావంతులుగా తీర్చిదిద్దాలనే ఆమె ఆలోచన అద్భుతం. పాఠశాల పరిసరాలను మ్యాథ్స్‌కు అనుగుణంగా సిద్ధం చేసింది. పాఠశాలను గణితాలయంగా మార్చింది. నిత్యం వాటిని గమనించే పిల్లలు వాటి గురించి ఆలోచించడం మొదలు పెట్టారు. అమె బోధన విధానంతో వారిలో మ్యాథ్స్ అంటే భయం పోయింది.

నిరుద్యోగులకు శుభవార్త

నేడు రాయచోటిలో మెగా జాబ్ మేళా



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి: అన్నమయ్య జిల్లా, రాయచోటి కేంద్రంగా ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళా ద్వారా యువతకు ఉద్యోగా వకాశాలు లభించనున్నాయి. ఈ జాబ్ మేళాలో పదివేలకుపైగా ఉద్యోగాలు ఉంటాయని ఎంపి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిలు చెబుతున్నారు. డిసెంబర్ 2వ తేదీ ఉదయం 9 గంటల నుంచి శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న జాబ్ మేళాలలో సుమారు వంద మల్టీనేషనల్ కంపెనీలు పాల్గొంటున్నట్లు ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారులు పేర్కొంటున్నారు. జాబ్ మేళాకు హాజరయ్యే యువతీ, యువకులు పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లమా, బిటెక్, ఫార్మసీ, నర్సింగ్, పీజి చదివి ఉండాలన్నారు. 18 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల వయస్సు కల్గిన అభ్యర్థులు అర్హులన్నారు. యువత ఉద్యోగం చేసి కుటుంబానికి అండగా ఉండాలని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఎంపీ, ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే

రాయచోటిలోని సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న మెగా జాబ్ మేళా ఏర్పాట్లను ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. నిర్వహకులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చే నిరుద్యోగ యువకులకు అర్థమయ్యేలా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఇంటర్వ్యూలకు వచ్చిన వారందరికీ భోజన వసతి, తాగునీటి సౌకర్యం గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. ఏమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి

ఓటరు జాబితా సవరణపై జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు అందించిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గిరీషాపీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో ఓటర్ జాబితా సవరణపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ జాబితాకు సంబంధించి ఎటువంటి సమాచారం కావాలన్నా పేపర్ మీద క్లియర్‌గా రాసి ఇవ్వాలని రాజకీయ పార్టీ నాయకులకు సూచించారు. శని, ఆదివారాలలో పోలింగ్ కేంద్రాల వద్ద నిర్వహించే ప్రత్యేక శిబిరాల్లో బిఎల్‌ఓలు ఉదయం నుంచి సాయంత్రం వరకు తప్పనిసరిగా ఉంటారని, అర్హత ఉన్న ఓటర్లు అందరూ ఓటుహక్కు నమోదు చేసుకోవాలన్నారు. డిసెంబర్ 9వ తేదీలోపు పెండింగ్ దరఖాస్తులను పూర్తిగా పరిష్కరించాలని సూచించారు. జనవరి 1, 2024కు 18 సంవత్సరాలు నిండినవారు ఓటరుగా నమోదు చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈనెల 4వ తేదీనుంచి జిల్లాలో ఈవీఎంలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, రాయచోటి, మదనపల్లె, రాజంపేట ఆర్డీఓలు రంగస్వామి, మురళీ, రామకృష్ణారెడ్డి, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

- ఈనెల 2,3వ తేదీల్లో జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలింగ్ కేంద్రాల్లో ముసాయిదా ఓటర్ల జాబితా సవరణపై ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు. శుక్రవారం విజయవాడలోని ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి ముసాయిదా ఓటర్ల జాబితా సవరణలో భాగంగా ముసాయిదా ప్రచురణ నుంచి నేటి వరకు పెండింగ్‌లో ఉన్న ఫారమ్‌లు, 18,19 యువ ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితాపై మీడియాలో వచ్చిన అంశాల్లో తీసుకున్న చర్యలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్ష నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎస్‌డీసీ శ్రీలేఖలు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ నియోజకవర్గ ఈఆర్‌ఓలతో మాట్లాడుతూ స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు బాధ్యతాయుతంగా కృషి చేయాలని పేర్కొన్నారు.

పింఛనానందం

రాయచోటి: పింఛన్ల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా సాగుతోంది. శుక్రవారం వేకవజాము నుంచే వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సంయుక్తంగా 85.04 శాతం మందికి పింఛన్లు అందించి లబ్ధిదారుల మెప్పు పొందారు. జిల్లాలో 224166 మందికి రూ. 62 కోట్లు మంజూరైంది. ఇందులో మొదటి రోజు రాత్రి 8.30 గంటల వరకు 1,90,621 మందికి రూ. 52 కోట్లు పంపిణీ చేసినట్లు వెలుగు పీడి సత్యనారాయణ, ఏపీడీ ధర్మరాజు తెలిపారు. మిగిలిన వారికి కూడా మరో రెండు రోజుల్లో పంపిణీ చేస్తామని తెలిపారు. వేలిముద్రల ఆధారంగా అందని వారికి కంటి చూపు ద్వారా గుర్తింపు చేసి అర్హులకు పెన్షన్లను అందజేశారు. ప్రతి నెల 1వ తేదీన పెన్షన్లు వాలంటీర్లు అందించడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.



చిన్నమండెం మండల పరిధిలో దివ్యాంగునికి పెన్షన్ అందజేస్తున్న వలంటీరు

డిమాండుకు అనుగుణంగా పనిదినాలు



మాట్లాడుతున్న ఎంజీఎన్ఆర్ఈజీఎస్ డైరెక్టర్ చిన్న తాతయ్య

ఎంజీఎన్ఆర్ఈజీఎస్ డైరెక్టర్ చిన్న తాతయ్య

కడప సిటీ: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి కుటుంబానికి డిమాండుకు అనుగుణంగా ఆర్థిక సంవత్సరంలో 100 రోజులకు తగ్గకుండా పనిదినాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ డైరెక్ట్ పి.చిన్నతాతయ్య పేర్కొన్నారు. శుక్రవారం వైఎస్సార్ జిల్లా డ్వామా కార్యాలయంలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలకు చెందిన డ్వామా పీడీలు పి.యదుభూషణరెడ్డి, ఎంసీ మద్దిలేటి, డీఆర్‌డీఏ పీడీ ఆనందనాయక్‌తో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. పలు సూచనలు, మార్గదర్శకాలను జారీ చేశారు. వైఎస్సార్ జిల్లాను మెట్ట ప్రాంతంగా గుర్తించినట్లు చెప్పారు. 35 మండలాల్లో ముఖ్యమైన పనులు చేపట్టాలన్నారు. వైఎస్సార్ జిల్లాలో ఇప్పటివరకు 72 లక్షల పనిదినాలు టార్గెట్ కాగా, నేటికి 68 లక్షల పనిదినాలను పూర్తి చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. మండలానికి కనీసం ఐదు అమృత్ సరోవర్ చెరువులు గుర్తించి పనులు చేపట్టాలన్నారు. ప్రతి మండలంలో 0.50 సెంట్ల విస్తీర్ణంలో 400 క్యూబిక్ మీటర్ల క్వాంటిటీతో 50 కొత్త మినీ అమృత్ సరోవర్‌లు, పర్కులేషన్ ట్యాంకులు, పర్కులేషన్ చెరువులను గుర్తించాలన్నారు. ప్రతి మండలానికి కనీసం 500 ఫారంపాండ్‌కుంటలు బండింగ్‌తోపాటుగా గుర్తించాలన్నారు. ప్రతి మండలంలో 200 ఎకరాల్లో పండ్ల తోటలు ఉండేలా చూడాలని, ఇందులో ఎస్సీ ఎస్టీలకు 50 శాతం వచ్చేలా చూడాలన్నారు. గుట్టలపై పచ్చదనం ఉండేలా ప్రతి మండలానికి ఒక గుట్టకు ఐదు హెక్టార్ల విస్తీర్ణంలో కనీసం ఐదు చొప్పున పనులు చేపట్టాలన్నారు. ఎస్సీ ఎస్టీలకు 50 శాతం తగ్గకుండా ప్రతి మండలంలో పశువుల పెంపకాన్ని ప్రోత్సహించాలన్నారు. ఆధార్ అనుసంధానంతో వేతన జీవులకు పేమెంట్ జరగాలన్నారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా), జిల్లా గ్రామీణ పేదరిక నిర్మూలన (డీఆర్‌డీఏ) సంస్థ కలిసి పనిచేస్తే ఎన్నో రకాల అభివృద్ధి పనులు చేపట్టవచ్చని సూచించారు. అనంతరం ఒంటిమిట్ట మండలం మంటపంపల్లె గ్రామ పంచాయతీలో లబ్ధిదారులకు ఆయన మునగ మొక్కలను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల ఉపాధి హామి సిబ్బంది, కార్యక్రమ అధికారులు, అదనపు కార్యక్రమ అధికారులు, ఇంజనీరింగ్ కన్సెల్టెట్లు, జూనియర్ ఇంజనీర్లు, ప్లాంటేషన్ సూపర్ వైజర్లు, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

'ఆడుదాం.. ఆంధ్ర'లో అగ్రస్థానం

రిజిస్ట్రేషన్లలో స్టేట్‌ఫస్ట్ వైఎస్ఆర్, సెకండ్ అన్నమయ్య



క్రీడాసామగ్రిని పంపిణీ చేస్తున్న డీఎస్‌ఏ కోచ్‌లు

కడప స్పోర్ట్స్: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి నిర్వహించనున్న 'ఆడుదాం ఆంధ్ర' మెగా క్రీడా టోర్నమెంట్ నిర్వహణకు రంగం సిద్ధమైంది. క్రికెట్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడాంశాల్లో సచివాలయ స్థాయి, మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయి పోటీలు నిర్వహించనున్నారు. అనంతరం రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించి విజేతలకు నగదు ప్రోత్సాహకాలను అందించనున్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల కోసం వ్యక్తిగత, జట్టు క్రీడాంశాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగంగా సాగుతోంది. డిసెంబర్ 10వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉంది. ఇందులో భాగంగా డిసెంబర్ 1వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియలో వైఎస్ఆర్ జిల్లా రాష్ట్రస్థాయిలో అగ్రస్థానంలో ఉంది. రాష్ట్రవ్యాప్తంగా 3.86 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా.. దాదాపు లక్షకుపైగా రిజిస్ట్రేషన్లు కేవలం వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల నుంచే ఉండటం గమనార్హం. వైఎస్ఆర్ జిల్లాలో 60,823 మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, ఇందులో 38,465 మంది పురుషులు, 22,358 మంది మహిళలు ఉండటం విశేషం. అదే విధంగా అన్నమయ్య జిల్లాలో 44,469 మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకుని రాష్ట్రంలో రెండోస్థానంలో నిలిచారు. వీరిలో 33,532 మంది పురుషులు, 10,937 మంది మహిళలు రిజిస్ట్రేషన్ చేసుకోవడం గమనార్హం.

క్రీడాసామగ్రి పంపిణీ ప్రారంభం..

'ఆడుదాం ఆంధ్ర' మెగా క్రీడాటోర్నమెంట్‌లో భాగంగా సచివాలయ స్థాయిలో పాల్గొనే క్రీడాకారుల కోసం బేసిక్ క్రీడాసామగ్రి, నియోజకవర్గస్థాయిలో పాల్గొనే క్రీడాకారుల కోసం ప్రొఫెషనల్ క్రీడాసామగ్రిని అందించనున్నారు. ఇందులో భాగంగా కడప నగరంలోని వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంకు వైఎస్ఆర్ జిల్లాకు సంబంధించిన క్రీడాసామగ్రి చేరుకుంది. ఇక్కడి నుంచి అన్ని మండలాలకు వాహనాల ద్వారా తరలిస్తున్నారు. పురుషులు, మహిళలకు వేర్వేరుగా కిట్‌లను రూపొందించారు. నీలరంగు కిట్‌లు పురుషులకు, పింక్ కలర్ కిట్లు మహిళలకు అందజేయనున్నారు. క్రికెట్ కిట్, బ్యాడ్మింటన్ కిట్, వాలీబాల్, నెట్ బాల్, ఖోఖో, కబడ్డీ క్రీడాసామగ్రిని పంపిణీ చేస్తున్నారు. వీటితో పాటు స్థానిక క్రీడలకు ప్రాధాన్యత ఇచ్చేలా టెన్నికాయిట్ వంటి క్రీడాసామగ్రి సైతం అందజేస్తున్నారు.

రక్షకుడు కాదు.. భక్షకభటుడు!

- కుమార్తె ఆచూకీ కోసం స్టేషన్‌కు వెళ్లిన మహిళ
- వెతికేందుకు హైదరాబాద్‌కు ఆమెతో పాటు వెళ్లిన హెచ్‌సీ భాస్కర్, మహిళాపోలీసు
- బాధితురాలిపై హెచ్‌సీ లైంగిక వేధింపులు
- సోషల్ మీడియాలో వీడియో హల్‌చల్
- భాస్కర్‌ను సస్పెండ్ చేసిన ఎస్పీ



సాక్షి ప్రతినిధి, కడప: కాపాడాల్సిన రక్షకభటుడే కాటేయజూశాడు. అండగా వచ్చాడనుకుంటే అవకాశం తీసుకోవాలనుకున్నాడు. పుట్టెడు వేదనలో ఉన్న బాధితురాలిపై లైంగికదాడికి విఫలయత్నం చేశాడు. చాలారోజులు ఎవ్వరికీ చెప్పుకోలేక ఆవేదనను అణచిపెట్టుకుంది. తనలా మరో మహిళ ఇలాంటి ఇబ్బందులు పడకూడదని నిర్ణయించుకుంది. హెడ్‌కానిస్టేబుల్ నిర్వాకాన్ని బహిర్గతం చేసింది. సోషల్ మీడియా కేంద్రంగా ఇప్పుడా వీడియో హల్‌చల్ చేస్తోంది. ఆమె ఆరోపించిన మేరకు వివరాలిలా ఉన్నాయి.

ఓబులవారిపల్లె మండలంలోని చిన్నఓరంపాడు భద్రావతి కాలనీకి చెందిన పేరూరు దుర్గమ్మ మైనర్ కుమార్తె సెప్టెంబర్ నెల 23న గ్రామానికి చెందిన మరో అబ్బాయితో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ విషయమై స్థానిక పోలీస్టేషన్‌లో కేసు నమోదు అయింది. ఈ క్రమంలోనే ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి బాలికను వెతికేందుకు హెడ్‌కానిస్టేబుల్ భాస్కర్, మహిళా పోలీసు రేవతిలను దుర్గమ్మతో పాటు అక్టోబర్ 6వ తేదీన హైదారాబాదుకు పంపించారు. అక్కడ ఓలాడ్జిలో హెడ్ కానిస్టేబుల్ దుర్గమ్మతో దుర్మార్గంగా ప్రవర్తించాడు. లైంగికంగా వేధించాడు. ఎంత వారించినా చెయిపట్టుకున్నాడు. అసభ్యంగా ప్రవర్తించి బూతులు మాట్లాడాడు. ఇందుకు మహిళా పోలీసుల కూడా సహకరించింది. ఈ నేపథ్యంలో బాలిక ఫోన్ చేయడంతో అందరూ వెనుతిరిగి వచ్చారు. ఈ విషయాలన్నీ వివరిస్తూ దుర్గమ్మ వీడియో తీసింది. అందులో కొద్ది రోజుల తర్వాత తన కుమార్తె మళ్లీ అదే అబ్బాయితో వెళ్లింద, తమకు న్యాయం చేయలేదని కూడా పేర్కొంది. ఈ వీడియో శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. కాగా, ఈ విషయంపై ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డిని వివరణ కోరగా రెండు నెలల క్రితం జరిగిన ఘటనను ఇంతవరకు ఎందుకు బహిర్గతం చేయలేదని ఆయన ప్రశ్నించారు. ఎవరో ఉద్దేశపూర్వకంగా అమెతో మాట్లాడించారని, ఆమె ఆరోపణల్లో వాస్తవం లేదని కొట్టిపారేశారు. కుమార్తె ఇంటి నుంచి వెళ్లిపోతే జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన వారు, ఇంత జరిగితే స్థానికంగా లేదా ఉన్నతాధికారులకు గానీ ఎందుకు ఫిర్యాదు చేయలేదని ఆయ సందేహం వ్యక్తం చేశారు.

హెచ్‌సీ భాస్కర్ సస్పెన్షన్

ఓబులవారి పల్లి హెడ్ కానిస్టేబుల్ అయిన డి.భాస్కర్ పైన వచ్చిన ఆరోపణల నేపథ్యంలో అతడిని అన్నమయ్య జిల్లా ఎస్పీ బి.రామకృష్ణ శుక్రవారం రాత్రి సస్పెండ్ చేశారు. అతడిని తక్షణమే విధుల నుండి తొలగించినట్లు రాజంపేట డీఎస్పీ వీఎస్‌ఎన్ చైతన్య తెలిపారు.

క్లుప్తంగా

ట్రాక్టర్ సీజ్

రామాపురం : కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిలోని మండల పరిధి గంగనేరు రోడ్డు సమీపంలో ఎలాంటి ఆధారాలు లేకుండా అక్రమంగా తిరుగుతున్న ట్రాక్టర్‌ను శుక్రవారం రాయచోటి ఆర్‌టీఓ సుబ్బరాయుడు సీజ్ చేసి మండల పోలీసులకు అప్పగించినట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు. ట్రాక్టర్, ట్యాలీతో వంగిమళ్ల నుంచి రాయచోటి వైపు ఎలాంటి పర్మిట్, రికార్డులు లేకుండా వెళ్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వాహనాల తనిఖీలో భాగంగా ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు.

కారు, బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు


కారును ఢీకొన్న ద్విచక్రవాహనం

మదనపల్లె : ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళుతున్న ఎంపీడీఓ కారును ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటన శుక్రవారం సాయంత్రం బైపాస్‌లోని కొండామారిపల్లె క్రాస్‌లో జరిగింది. కొండామారిపల్లెలో జరగనున్న ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళుతున్న ఎంపీడీఓ కారును బసినికొండకు చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై వస్తూ ఢీకొన్నారు. ప్రమాదంలో బైక్‌లో ప్రయాణిస్తున్న వ్యక్తులకు గాయాలయ్యాయి. ఎంపీడీఓ కారు పాక్షికంగా దెబ్బతింది. గమనించిన స్థానికులు గాయపడిన యువకులను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

మహిళ అదృశ్యం

రామాపురం : మండలంలోని సరస్వతిపల్లె గ్రామానికి చెందిన పెయ్యల దేవి(22) నవంబర్ 30వ తేది అర్ధరాత్రి నుంచి కనిపించడం లేదని ఆమె భర్త చిన్నరెడ్డయ్య శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వైఎస్సార్ జిల్లా చింతకొమ్మదిన్నె మండలం నరసరామయ్యగారిపల్లెకు చెందిన నల్లగాని గురయ్య కుమార్తె దేవిని రెండు సంవత్సరాల క్రితం చిన్నరెడ్డయ్య వివాహం చేసుకున్నాడు. ఇంత వరకు పిల్లలు లేరని, తన భార్యకు తనకు ఎలాంటి గొడవలు వచ్చేవి కాదని ఫిర్యాదులో తెలిపాడు. ప్రతి రోజూ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించేవారమని పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు.

వ్యక్తిపై బీర్ బాటిల్‌తో దాడి

కడప అర్బన్ : కడప నగరంలోని రిమ్స్ పీఎస్ పరిధిలో పుట్లంపల్లెకు చెందిన నాగమునిపై అదే ప్రాంతానికి చెందిన రాంగోపాల్‌వర్మ అలియాస్ చిన్న, మరో ముగ్గురు స్నేహితులతో కలిసి గురువారం తన దగ్గరికి పిలిపించి బీర్ బాటిల్‌తో తలపై బాది దాడి చేశారు. ఈ సంఘటనలో గాయపడిన నాగముని తీవ్రగాయంతో రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. వీరి మధ్య వున్న మనస్పర్థలతో ఈ సంఘటన చోటుచేసుకుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కడప రిమ్స్ పీఎస్ ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

వర్షం.. రైతులకు అప్రమత్తత అవసరం

- మియాచువాంగ్ తుపాను ప్రభావం
- పంటల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి
- వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు


కమలాపురం వద్ద రైతులకు సూచనలు ఇస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు

కడప అగ్రికల్చర్ : మియాచువాంగ్ తుపాను వల్ల రాబోయే మూడు రోజులు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అయితా నాగేశ్వరరావు తెలిపారు. కావున రైతులు అప్రమత్తంగా ఉంటూ తమ పంటలను కాపాడుకోవాలని పేర్కొన్నారు. ఈ విషయమై శుక్రవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించి పంటలను పరిశీలించి, రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ముఖ్యంగా వరి, జొన్న పంటలు కోతకు సిద్ధంగా ఉన్న రైతులు, కోత కోసిన వారు జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. కోతకు వచ్చిన వరి, జొన్న పంటలేవైనా ఉంటే కోతలను కొద్ది రోజులు ఆపుకోవాలని తెలిపారు. ఒక వేళ కోతలు కోసి ఉంటే ధాన్యం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం వరి, పత్తి, జొన్న పంటలు సాగు చేశారని తెలిపారు.

వరి..

వరి పంట గింజ గట్టిపడే దశలో ఉన్నప్పుడు తుపాను లేదా మబ్బులతో కూడిన వాతావరణం ఉన్నచో తెగుళ్లు వచ్చే అవకాశం ఉందన్నారు. అలాంటప్పుడు హెక్సాకోనోజోల్‌ను రెండు ఎంఎల్ మందును ఒక లీటరు నీటికి లేదా ప్రొఫికొనోజోల్‌ను 1ఎంఎల్‌ను ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. పంట కోత కోసినప్పుడు టార్పలిన్ షీట్స్ ఉండాలని తెలిపారు. ముఖ్యంగా వాతావరణాన్ని చూసుకుని పంట కోత చేసుకోవాలని తెలిపారు. ఒక వేళ కోసినట్లు అయితే పంటను వెంటనే కల్లాల్లో కుప్పగా చేసి టార్పలిన్ పట్టలు కప్పి చుట్టూ పాదులు తీయడం చేయాలన్నారు. అలా చేయడం ద్వారా పట్టపై పడిన నీరు బయటకు వెళ్లిపోవడం జరుగుతుందని తెలిపారు.

పత్తి..

పత్తి పంటలో అవకాశాన్ని బట్టి త్వరగా పత్తి కోయడం మంచిదన్నారు. పంట నీట మునిగినప్పుడు కాలువల ద్వారా మురుగునీటిని తీసివేయాలన్నారు. తర్వాత 25 గ్రాముల యూరియాను ఎకరాకు లేదా 20 గ్రాముల యూరియాను ఒక లీటరు నీటికి లేదా 19.19.19 లేదా 13.0.46ను 20 గ్రాముల యూరియా ఒక లీటరు నీటికి కలిపి పంటకు పిచికారీ చేసుకోవాలని తెలిపారు. పత్తి పంటకు తెగుళ్లు రాకుండా హెక్సాకొనాజోల్ 2 ఎంఎల్‌ను ఒక లీటరు నీటికి లేదా సిఓసిని 3 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ విధంగా పంటలలో తగు చర్యలు తీసుకొని భారీ వర్షాల నుంచి పంటలను నష్టపోకుండా కాపాడుకోవాలని ఆయన సూచించారు.

జిల్లాలో 15 మండలాల్లో..

- అత్యధికంగా అట్లూరులో 25 మి.మీ వర్షపాతం
- 3, 4, 5 తేదీల్లో భారీగా వర్షాలు పడే అవకాశం

కడప అగ్రికల్చర్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. మియాచువాంగ్ తుపాను ప్రభావంతో జిల్లాలో ఈ నెల 3, 4, 5 తేదీలలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య, వాతావరణ శాస్త్రవేత్త స్వామి చైతన్య తెలిపారు. గురువారం తెల్లవారుజామున నుంచి జిల్లాలో 15 మండలాల్లో వర్షం కురిసింది. ఇందులో అట్లూరు మండలంలో అత్యధికంగా 25 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చెన్నూరు మండలంలో 13.6, ఒంటిమిట్టలో 13.2, సిద్ధవటం 9.4, కమలాపురం 6.2, వల్లూరు 5.8, సింహాద్రిపురం, రాజుపాలెం 3.2, వేముల 3, మైదుకూరు 2.4, ఖాజీపేట 2.2, బద్వేలు, ఎర్రగుంట్ల 1.8, చింతకొమ్మదిన్నె 1.6, గోపవరంలో 1.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు



వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు విద్య ప్రవేశపెట్టి పేద పిల్లలు ప్రపంచ స్థాయి పోటీని తట్టుకునేలా తీర్చిదిద్దుతున్నారు. 3, 4, 5వ తరగతుల విలీనం ద్వారా సబ్జెక్టుల వారి టీచర్లు, డిజిటల్ విద్యా విధానం కోసం తరగతి గదుల్లో ఐఎఫ్‌బీ, టీవీ స్క్రీన్‌లు, వీటిలో ఉంచాల్సిన పాఠ్యాంశాలు, బైజూస్ ట్యాబ్‌ల వినియోగం, జగనన్న విద్యాకానుక, నాడు–నేడు ద్వారా విద్యార్థులకు అద్భుతమైన, ఆహ్లాదకరమైన పాఠశాల వాతావరణం ఏర్పడడమే కాకుండా ఉత్తమ బోధన లభిస్తోంది. – మడితాటి నరసింహారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, జెడ్పీహెచ్ఎస్, సంబేపల్లె

సొంతింటి కల నెరవేరింది



నా పేరు నారా వెంకట గాయత్రి. మాది అన్నమయ్య జిల్లా, సంబేపల్లె మండలం, గుట్టపల్లి గ్రామం, బావులు కాడపల్లె. మాకు సొంతిల్లు లేక అద్దె ఇంట్లో ఉండేవాళ్లం. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే నవరత్నాలలో స్థలంతోపాటు ఇల్లు మంజూరైంది. ప్రభుత్వం నుంచి అందిన సహకారంతో ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నాం. ఇటీవల కొత్తగా కట్టుకున్న ఇంట్లోకి గృహప్రవేశం చేశాము. ఇంతకు ముందు అద్దెతో అవస్థలు పడుతూ నెట్టుకొచ్చిన మాకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన ఇంటితో సొంతింటి కల సాకారమైంది.

ఇంటి వద్దకే చేరిన ధ్రువపత్రాలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం మాలాంటి నిరుపేదలకు ఎంతో ఉపయోగపడింది. ఈ కార్యక్రమం ద్వారా సచివాలయ సిబ్బంది అడిగిన పత్రాలను ఇచ్చారు. మాకు మంజూరైన కుల, ఆదాయ తదితర ధ్రువీకరణపత్రాలు ఇంటి వద్దకే చేరడం మాకెంతో సంతోషంగా ఉంది. గతంలో మేము కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. ఇపుడు జగనన్న ప్రభుత్వంలో ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి ధ్రువపత్రాలను అందజేసి ఇవ్వడం చెప్పలేని సంతోషంగా ఉంది. సీఎం జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం. – రమణ, చిన్నమండెం టౌన్, అన్నమయ్య జిల్లా

మెడికల్ షాపులపై విజిలెన్స్ దాడులు


మెడికల్ షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

కడప అర్బన్ : కడప నగరంలోని వివిధ ప్రాంతాల్లోని మెడికల్ షాపులపై కడప రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్ మాసుంబాషా ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారులు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌లతో కలిసి శుక్రవారం దాడులు నిర్వహించారు. లైఫ్ మెడికల్స్, జనతా మెడికల్స్, శ్రీశ్రీ ఫార్మసీ ఇన్ హోలిస్టిక్ ఇన్ హోలిస్టిక్ హాస్పిటల్స్, తిరుమల ఫార్మా, అహోబిల మెడికల్స్, అపోలో మెడికల్ షాప్, ఎస్.ఎస్.మెడికల్స్, స్వస్తిక్ మెడికల్స్ వాటికి అనుబంధంగా వున్న గోడౌన్‌లను పలు మందుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. మందుల దుకాణాల నిర్వహణలో అనేక లోపాలున్నట్లు వారు గుర్తించారు. మందుల షాపులలో ఫార్మాసిస్టుల హాజరు, వారి సమక్షంలో మందుల అమ్మకం, డ్రగ్ లైసెన్స్, ఫార్మాసిస్ట్ సర్టిఫికెట్లను పరిశీలించారు. వీటన్నిటిపైన సమగ్ర నివేదికను రూపొందించి ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ అధికారులు జి.ఈదురుబాష, టి.రెడ్డెప్ప, జి.శ్రీనివాసులు, ఈ.బాలగంగాధర్‌రెడ్డి, కడప డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జి.మాధవి, రాయచోటి డ్రగ్ ఇన్‌స్పెక్టర్స్ ఎస్. జయరాముడు, వి.అశోక్‌కుమార్, విజిలెన్స్ హెడ్ కానిస్టేబుల్ ఎస్.జనార్ధనరావు, డి.హరినాథ్‌రెడ్డి, డి.రంతుబాష, పి.సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

రాయచోటి అర్బన్ : బి.కొత్తకోట తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం నేతలు కలెక్టర్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టర్ గిరీషా పీఎస్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ బి.కొత్తకోట మండలం సర్వే నంబరు 427 బి2బిలో పి.వెంకటరమణ, ఆవుల వేమన్న, పి.వీరప్ప, పి.రమణలకు 2.27 ఎకరాల భూమికి ఈ పాసుబుక్కులు ఉన్నాయన్నారు. వీరికి ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా నిధులు కూడా అందుతున్నాయన్నారు. వీరంతా మదనపల్లె వ్యవసాయ అభివృద్ధి బ్యాంకు ద్వారా రుణాలు తీసుకుని బావులు తవ్వుకుని వ్యవసాయం చేసుకుంటున్నారని వివరించారు. కాగా భూకబ్జాదారులతో కుమ్మక్కైన కొత్తకోట తహసీల్దార్ రఫీక్ అహమ్మద్ రికార్డులను పరిశీలించకుండా పెద్దకోనప్ప పేరుతో ఖాతా నంబరు 1273ను సృష్టించి 1బీ మంజూరు చేశారన్నారు. కలెక్టర్ సమగ్ర విచారణ జరిపించి తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రామాంజులు, నేతలు రామచంద్ర, డీసీ వెంకటయ్య, మాధవలు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన కునుకు

- డివైడర్‌ను ఢీకొన్న పాలట్యాంకర్
- క్యాబిన్‌లో ఇరుక్కుని డ్రైవర్ దుర్మరణం


శ్రీనివాసన్ మృతదేహం

బి.కొత్తకోట : నిద్రమత్తులో కునుకు తీయడంతో ప్రాణాలు కోల్పోయిన డ్రైవర్ ఉదంతం గురువారం రాత్రి బి.కొత్తకోట మండలం ఖానీతోపు వద్ద జరిగింది. ఎస్‌ఐ రామమోహన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా పలమనేరులోని దొడ్ల డెయిరీ నుంచి పాల ట్యాంకర్‌తో తమిళనాడు రాష్ట్రం తిరుచ్చి జిల్లా సాగేపట్టుకు చెందిన డ్రైవర్ శ్రీనివాసన్ (50) కర్నూలుకు బయలుదేరాడు. రాత్రి 11 గంటల సమయంలో జాతీయరహదారిపై వెళ్తూ బి.కొత్తకోట మండలం ఖానీతోపు వద్దకు రాగానే ఆయన నిద్రలోకి జారుకున్నాడు. దీనితో ట్యాంకర్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ట్యాంకర్ క్యాబిన్ ధ్వంసమై శ్రీనివాసన్ అందులో ఇరుక్కున్నాడు. తీవ్రగాయాలు కావడంతో క్యాబిన్ లోపలే దుర్మరణం చెందాడు. ట్యాంకర్ బోల్తా పడటంతో 15 వేల లీటర్ల పాలు మట్టిపాలైంది. ఈ ప్రమాద సమాచారం అందుకున్న ఎస్‌ఐ రామమోహన్ ఘటన స్థలానికి చేరుకుని డ్రైవర్‌ను వెలికితీసే ప్రయత్నాలు చేశారు. చీకటి కావడంతో డ్రైవర్ పరిస్థితి తెలియరాలేదు. ట్యాంకర్‌లో డ్రైవర్ మాత్రమే ఉండటంతో అతన్ని కాపాడేందుకు, సమాచారం ఇచ్చేందుకు ఎవరూ లేకపోయారు. దీనితో జేసీబీ ద్వారా క్యాబిన్‌ను తొలగించి అందులో ఇరుక్కున్న శ్రీనివాసన్ మృతదేహాన్ని వెలికి తీశారు. ప్రమాదంలో తీవ్రగాయాలకు గురై ఘటనా స్థలంలోనే మృతి చెందినట్టు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుని కుమారుడు విఘ్నేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

రాజంపేటలో మొబైల్ రికవరీమేళా


మాట్లాడుతున్న డీఎస్పీ చైతన్య

రాజంపేట : రాజంపేట డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం మొబైల్ రికవరీమేళా నిర్వహించారు. రూ.44 లక్షల విలువ చేసే సెల్‌ఫోన్ల రికవరీని చూపించారు. దీంతో సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులలో ఆనందం కనిపించింది. ఈ నేపథ్యంలో రాజంపేట డీఎస్పీ చైతన్య ఎస్‌డీపీఓ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 2023 ఆగస్టు నుంచి నవంబరు నెల వరకు సెల్‌ఫోన్స్ పోగొట్టుకున్న వారి మొబైల్స్‌లను జిల్లా సైబర్‌క్రైం ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో సైబర్ క్రైం సిబ్బంది ఐదవసారి 200 మొబైల్‌ఫోన్లను రికవరీ చేశారన్నారు. వాటి విలువ రూ.44 లక్షలు ఉంటుందన్నారు. వీటిని బాధితులకు అందజేశామన్నారు. ఇప్పటి వరకు 774 మొబైల్ ఫోన్ (విలువ రూ.1.56 కోట్లు)లను బాధితులకు పోలీసుశాఖ అందజేసిందన్నారు. మొబైల్ ఫోన్ పోతే జిల్లా వాట్సాప్ నంబరు 8688830012కు హాయ్ అని పెట్టగలరన్నారు. httpr://gormr.fe/ccwf ufkATEbrer4B9, httpr://www.ceir.gov.in/Ho-m-e/i ndex.jrp లింక్స్ నొక్కడం ద్వారా పోయిన మొబైల్స్ వివరాలను తెలియజేస్తే బాధితులకు త్వరితగతిన అందజేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. పోలీసుస్టేషన్‌కు వెళ్లకుండానే, ఎఫ్ఐఆర్ కట్టకుండానే సులభంగా రికవరీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

సైబర్ పోలీసులకు ఎస్పీ అభినందనలు

మొబైల్స్ రికవరీలో సక్సెస్ అయిన సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్‌ఐ బాలకృష్ణ, సైబర్ క్రైంటీం సభ్యులు పోలీసులు నరసింహనాయక్, రవిశేఖర్, అబ్దుల్‌సాహుల్, జె.రాధ, ఫామిస్ ఆరాస్, ఇలియాజ్, దేవేంద్రలను జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల నుంచి ప్రశంసలు అందుకున్నారు. మీడియా సమావేశంలో డీఎస్పీతోపాటు సీఐలు మద్దయ్య ఆచారి, మంజునాథరెడ్డి, పట్టణ ఎస్‌ఐ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


నాసీర్ అలీఖాన్ (ఫైల్)

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ట్రాఫిక్ ఎస్‌ఐ మహమ్మద్ రఫీ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి పట్టణంలోని మహబూబ్‌నగర్‌కు చెందిన పఠాన్ నాసీర్ ఆలీఖాన్ (17) స్కూటర్ మెకానిక్‌గా పని చేస్తుండే వాడు. ఆయన స్కూటర్‌పై వెళ్తూ ట్రంక్ రోడ్డు సమీపంలో అదుపు తప్పి కింద పడ్డాడు. అదే సమయానికి పుంగనూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మదనపల్లె నుంచి కడపకు వెళ్తోంది. ఈ బస్సు నాసీర్ ఆలీఖాన్ తలపై ఎక్కింది. దీంతో ఆయన తలకు తీవ్ర గాయం అయ్యింది. స్థానికులు ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేశారు. కానీ అంతలోనే మృతి చెందడంతో పోలీసులు వచ్చి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేతనం కోసం సెక్యూరిటీ సిబ్బంది ధర్నా


సోలార్ పవర్ ప్రాజెక్టు వద్ద ధర్నా చేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

గాలివీడు : మండలంలోని తూముకుంట సోలార్ పవర్ ప్రాజెక్టులో సెక్యూరిటీ గార్డులు శుక్రవారం వేతనాల కోసం ధర్నా చేశారు. టాటా పవర్ సోలార్‌లో సెక్యూరిటీలుగా 7 ఏళ్లుగా పని చేస్తున్నామని వారు తెలిపారు. ఐదేళ్ల నుంచి విశ్వం సెక్యూరిటీ సర్వీసెస్ వారు వేతనాలను సకాలంలో ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ప్రతి నెల ధర్నా చేస్తే తప్ప వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలను సకాలంలో ఇవ్వాలని ప్రశ్నిస్తే తమపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ముగిసిన పెద్దదర్గా ఉరుసు


స్వస్థలాలకు బయలుదేరుతున్న భక్తులు

కడప కల్చరల్ : ప్రముఖ సూఫీ ఆధ్యాత్మిక క్షేత్రమైన కడప అమీన్‌పీర్ (పెద్ద) దర్గా ప్రధాన ఉరుసు ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. దాదాపు వారం రోజులపాటు వైభవోపేతంగా నిర్వహించిన ఈ ఉత్సవాలలో ప్రధాన ఘట్టాలు ముగిసిపోవడంతో శుక్రవారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ ఫకీర్లు, భక్తుల విన్నపాలను విని సూచనలు, సలహాలు ఇచ్చారు. వారు పాటించాల్సిన విధి విధానాలను తెలియజేశారు. ఫకీర్ల సంఘాలు, దూర ప్రాంతాల నుంచి వచ్చిన శిష్యగణం ఈ సందర్భంగా తిరిగి వెళ్లేందుకు ఆయన అనుమతిని పొందారు. ఉరుసు ఉత్సవాలకు దేశం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు, ప్రముఖులు, కవులు, కళాకారులు కూడా వేచి ఉండి పీఠాధిపతిని దర్శించుకుని ఆయన అనుమతితో తమ స్వస్థలాలకు తరలి వెళ్లారు.

డ్రాగా ముగిసిన అండర్–23 జోనల్ మ్యాచ్


క్రికెట్ పోటీల్లో మ్యాచ్ ఆడుతున్న నార్త్‌జోన్, సెంట్రల్ జోన్ జట్లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జోనల్ అండర్–23 క్రికెట్ టోర్నమెంట్‌లో నిర్వహించిన రెండోదశ మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 121 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన సెంట్రల్‌జోన్ జట్టు మూడో రోజు శుక్రవారం 66 ఓవర్లలో 173 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని దుర్గాబాలాజీ 55 పరుగులు చేశాడు. నార్త్‌జోన్ బౌలర్ శ్రీకర్ సాయిరెడ్డి 4 వికెట్లు తీశారు. అనంతరం ఫాలోఆన్‌లో భాగంగా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన సెంట్రల్‌జోన్ జట్టు 26 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 90 పరుగులు చేసింది. నార్త్‌జోన్ బౌలర్లు శ్రీకర్ సాయిరెడ్డి 3 వికెట్లు తీశారు. దీంతో ఫలితం తేలకపోవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా నార్త్‌జోన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 639 పరుగుల వద్ద డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే. దీంతో నార్త్‌జోన్ జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

సౌత్‌జోన్‌కు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మరో మ్యాచ్‌లో 323 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన సౌత్‌జోన్ జట్టు 104 ఓవర్లలో 398 పరుగులు చేసి ఆలౌట్ అయింది. జట్టులోని అఖిల్ 34 పరుగులు చేశాడు. రెస్ట్ ఆఫ్ జోన్ బౌలర్ ఆశిష్ రెడ్డి 4 వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన రెస్ట్ ఆఫ్ జోన్ జట్టు చివరి రోజు ఆట ముగిసే సమయానికి 8 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 56 పరుగులు చేసింది. జట్టులోని రోహిత్ రోషన్ 26 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. సౌత్‌జోన్ బౌలర్లు సంతోష్ 1, అఖిల్ 1 వికెట్ తీశారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో రెస్ట్ ఆఫ్ జోన్ జట్టు 362 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో సౌత్‌జోన్ జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

గుడి తిరునాలకు చర్చి ముస్తాబు


విద్యుత్ దీప కాంతులీనుతున్న చర్చి

కలసపాడు : కలసపాడులోని సగిలేరు ఒడ్డున ఉన్న పరిపేతురు పరిపాలు చర్చి 136వ వార్షికోత్సవానికి ముస్తాబైంది. శని, ఆదివారాల్లో వేడుకలు నిర్వహిస్తున్నట్లు డీసరీ చైర్మన్ సంజయ్‌మధు, ఆశిస్‌గ్రాబ్రియేల్, బేబీసరోజ, రవిక్రీస్తుదారి, శ్రీనివాస్‌పాల్‌లు తెలిపారు. 2వ తేదీ శనివారం సాయంత్రం రాయలసీమ బిషప్ రెవ.డాక్టర్ పి.ఇస్సాక్ వరప్రసాద్ ఊరేగింపు ఉంటుందని, రాత్రి 6–30 గంటలకు క్రైస్తవ సంగీత విభావరి, 7 కు పిల్లలచే సాంస్కృతిక కార్యక్రమాలు, 8–30కు దీపారాధన, 9–30కు కానుకలు సమర్పించుట, రాత్రి 10కి యువజనులచే సాంస్కృతిక కార్యక్రమాలు, 10–30కు గుడిమెసుదర్శన్ వారిచే చెక్కభజన, 11–30కు గుమ్మడి జీవన్‌కుమార్ విజయవాడ వారిచే దావీదు విజయం క్రైస్తవ నాటకం ఉంటుందన్నారు. 3వ తేదీన ఉదయం 4 గంటలకు మొదటి ఆరాధన, ప్రభురాత్రి భోజన సంస్కారం, 7కు గుడిప్రదర్శన, 9కి బాప్తిస్మములు, సాయంత్రం 4కు ప్రతిష్ఠ పండుగ ప్రత్యేక ప్రార్థన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా చర్చిని సుందరంగా అలంకరించి భక్తుల కోసం చలువపందిళ్లు ఏర్పాటు చేశారు. పిల్లల కోసం జెయింట్‌వీల్ తదితర ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్చి కమిటీ వారు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎస్‌ఐ నాగమురళి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించనున్నారు.